కథ

# కరిగినకల

◆ జీరు లక్ష్మీదేవి ◆

## కొలాన్నీ, దూరాన్నీ మింగుతూ ముందుకు దూసుకుపోతోంది హైదరాబాద్ నుండి బొంబే వెళ్ళే రైలు.

దాంట్లో ప్రయాణం చేస్తున్న మనోజ్ మనసు అంతకు కొన్ని రెట్ల వేగంతో గతంలోకి దూసుకుపోయి విహరించసాగింది.

సరిగ్గా సంవత్సరం క్రితం ఇదే రైలులో ప్రయాణం చేసి అన్నయ్య వాళ్ళింటికి ఆదోని వెళ్ళాడు. ఆ ఊరు వెళ్ళడం అదే ప్రథమం కాబట్టి బిక్క చూపులతో ప్లాట్‌ఫారమ్‌పై నిల్చున్న అతనికి అన్నయ్యే ఎదురొచ్చాడు. తను డ్యూటీలో ఉండడంతో ఓ పోర్టర్నిచ్చి ఇంటికి పంపాడు. నిరుద్యోగ పర్వంతో బరువుగా, నిరాశ నింపుకున్న కళ్ళతో కాళ్ళీడ్చుకుంటూ కేవలం మెంటల్ రిలీఫ్ కోసమే అక్కడికి వెళ్ళాడతను.

వదినకి తనంటే ఎంతో అభిమానం. హఠాత్తుగా దిగిన తనని చూడగానే నానా హడావిడీ చేసింది. ఏవేవో చేసి పుష్టిగా భోజనం పెట్టింది. బాగా తినడంవల్ల, ప్రయాణబడలిక వల్ల భోంచేయగానే మంచి నిద్రపట్టింది.

"అక్కయ్య... అక్కయ్య" అన్న అరుపులతో మళ్ళీ హఠాత్తుగా మెలకువ వచ్చింది. లోపలికి చెంగున లేడిలా దూసుకువస్తున్న లేడి కాస్తా తను చూడగానే ఠక్కున ఆగిపోయింది. ఆమెని చూడగానే తన బద్ధకం కాస్త పూర్తిగా వదిలిపోయింది. చటుక్కున లేచి కూర్చున్నాడు.

వెనక్కి తిరిగి వెళ్ళబోతున్న ఆ మెరుపుతీగని ఉద్దేశించి "వదిన వంటింట్లో ఉన్నట్లుంది లోపలికి వెళ్ళండి" అని అన్నాడతను.

"మళ్ళీ వస్తాలెండి" మెరుపుతీగ మెరిసినట్టే మెరిసి మాయమైపోయింది.

"లేచావా... నీ కోసమే చూస్తున్నాను" లేచి ముఖం కడుక్కునిరా... అంటూ రెండు ప్లేట్లలో కారబ్బూంది, లడ్డు పెట్టుకుని వచ్చింది వదిన.

"అబ్బ... టిఫినా... నసిగాడతను".

"నువ్వెంత సేపు పడు కున్నావనుకుంటున్నావు? రెండు గంటలు దాటింది. తిన్న అన్నం అరిగిపోయే ఉంటుంది. మొహం కడుక్కో లేచి" అంటూ పురమాయించింది.

అయినా మనసులోని కుతూహలం అణుచుకోలేక "ఇంతకుముందే ఎవరో అమ్మాయి వచ్చింది వదినా... 'అక్కా' అంటూ నన్ను చూడగానే జడుసుకొని పారిపోయింది. నిన్నగా నవ్వాడతను.

"ఓహో! లత వచ్చిందా? ఆ అమ్మాయి ఎవరో కాదు. ఎదురింటి అమ్మాయే".

మొదటి చూపులోనే అంతగా తనని ఆకట్టుకున్న ఆ పిల్ల వివరాల్ని సేకరించడం ఎలా అని ఆలోచించుకుంటూనే మొహం కడుక్కొని వచ్చాడు. టిఫిన్ తింటూ నెమ్మదిగా వదిన దగ్గర విషయాన్ని కదిలించాడు.

"టెన్త్ పోవడంతో చదువు ఆపేసింది. అప్పుడప్పుడూ పుస్తకాల కోసం కబుర్లకోసం వచ్చిపోతుంటుంది. వాగుడుకాయపిట్ట" వదిన అంది.

"మరి నేను లోపలికి వెళ్ళమని చెబుతున్నా అలా పారిపోయిందేం?" అమాయకంగా అడిగాడతను.

"ఎంత వాగుడుకాయ అయితే మాత్రం పరాయి మగాడ్ని చూస్తే సిగ్గుపడదా ఏమిటి?" భళ్ళున నవ్వింది వదిన.

తను పరాయి మగాడే! ఆ ఊహ భరించలేకపోయాడు. సాధ్యమైనంత త్వరలోనే ఆమెకి దగ్గర కావాలని అప్పుడే నిర్ణయించుకున్నాడతను.

అందుకే కాసేపుండి మళ్ళీ వచ్చిన ఆమెతో వదినతో పాటు కబుర్లలోకి దిగాడు. అరగంటలో ఎంతో చనువుగా మాట్లాడటం మొదలుపెట్టింది లత.

నవ్వుతుంటే ఆమె అందం మరింత విజృంభించేది. ముక్కు పొడవు మరింత పొడుచుకొచ్చి బుగ్గలు ఉబ్బి కెంపులు అయ్యేవి. అలా చూస్తున్నప్పుడల్లా ఆ అందాన్నంతటినీ సొంతం చేసుకోవాలనే తపన అతనిలో పెరిగిపోతుండేది.

★★★★

అన్నయ్య డ్యూటీలో వుంటే కలుసుకోవాలని స్టేషన్‌కు బయల్దేరాడతను.

గేటు దగ్గర ఎదురొచ్చింది లత.

విరిసీ విరియని పువ్వులా ఓ నవ్వు విసిరింది. అంతలో అతని గుండె లయతప్పింది. ముందుకు అడుగు పడక, ప్రక్కనే ఉన్న గులాబీ పువ్వుని

◆◆◆

**మెరుపుతీగ మెరిసినట్టే మెరిసి మాయమైపోయింది.**

◆◆◆

కోసాడతను.

"అరె...పువ్వుని కోసేసారా? తనకి పువ్వులంటే ఎంత ఇష్టమయినా గులాబీ పూలని చెట్ల నుంచి కోయదు అక్కయ్య. మనతలలోకన్నా చెట్లకుంటేనే అవి అందంగా ఉంటాయి అంటుంది" అంది నవ్వుగా నవ్వుతూ లత.

నవ్వితే ఆమె బుగ్గలు సొట్టలుపడి, కళ్ళు చిన్నవై మరింత అందంగా ఉంటుంది. ఆ అందాన్ని చూస్తూ భరించలేకపోయాడతను. చేతిలోవున్న గులాబీ పువ్వు నలిగిపోయింది.

◆◆◆

## తను నలిపి కిందపారేసిన పువ్వుని లత భద్రంగా తన తలలో పెట్టుకుంది.

◆◆◆



"అదేమిటి ఆ పువ్వుని అలా నలిపి పారేస్తున్నారు?" మరింత నిలిపిగా మళ్ళీ నవ్వింది.

లాభంలేదు... తను మరికొంత సేపు నిలబడితే తనేం చేస్తాడో తనకే తెలీదు. చేతిలో నలిగి పోయిన పువ్వుని కిందపారేసి "మళ్ళీ వస్తా అన్నయ్య దగ్గరికి వెళ్ళి" అని ముందుకు సాగిపోయాడతను.

వెళ్ళాడన్న మాటేగాని అన్నయ్య దగ్గర కూర్చోలేకపోయాడు. కాసేపు కూర్చున్నాననిపించి తిరిగి ఇంటికి బయల్దేరాడు.

మళ్ళీ సరిగ్గా గేటు దగ్గర లత ఎదురొచ్చింది. పలకరింపుగా ఓ నవ్వు విసిరి వాళ్ళింటివేపు వెళ్ళింది.

వెనుక నుంచి కనిపిస్తున్న ఆమె జడలో వున్న గులాబీని చూసి ఉలిక్కిపడ్డాడతను. ఇందాక తను నలిపి కిందపారేసిన పువ్వు అది.

తను నలిపి కిందపారేసిన పువ్వుని లత భద్రంగా తన తల్లో పెట్టుకుంది. అంటే ఆమె తనని ప్రేమిస్తోందన్నమాట!

ఉబ్బితబ్బిబ్బయిపోయాడతను. ఆ రాత్రి ఇక శివరాత్రే అయింది. ఆమె తలపులతోనే నిద్ర దూరమైంది.

## కథ

# 'చిరంజీవి' కాంగ్రెస్‌లో చేరుతాడా?

ఎందరో నటీనటులు వెండి తెర మీద నుంచి రాజకీయాల లోకి వచ్చి, ప్రముఖ పాత్రను వహించారు. ఇప్పుడు మెగాస్టార్ చిరంజీవి కూడా రాజకీయాలలోకి రాబోతున్నాడన్న వార్త వినిపిస్తోంది. ఆయన పుట్టిన రోజు ఆగస్టు 29న తను కాంగ్రెస్‌లో చేరేది, తెలుగుదేశంలో చేరేది ప్రకటిస్తారట. అతను ఏ పార్టీలో చేరినా సంచలనం అవుతుందని అంటున్నారు. కాంగ్రెస్‌లో చేరేందుకు ఎక్కువ అవకాశం వుందని మేధావులు అంటున్నారు... ఏం జరుగుతుందో చూడాలి!



ఉదయాన్నే మగతగా అలా పడుకొని వున్న అతనికి "అక్కయ్య...అక్కయ్య" అదే తియ్యని గొంతు వినబడి కళ్ళు తెరిస్తే ఎదురుగా మెరుపు తీగ. తనవైపు ఓరగా చూస్తూనే ఈ రోజు రణ మండ్ల కొండ ఎక్కడానికి వస్తావా అక్కయ్య" అంది.

అంతలో వదిన "హా! ఈ రోజు శ్రావణ మాసం మూడో శనివారం కదా! మరిచిపోయాను . అయినా నాకు ఒంట్లో బాగాలేదు లత. ఆయన డ్యూటీకి వెళ్ళారు. అన్నట్టు... మా మనోజ్‌ను తీసుకెళ్ళు కొండనెక్కి ఆంజనేయస్వామి దర్శనం చేసుకొంటే మన కోరికలు నెరవేరుతాయి అంటారుగా! అంటూనే...

మనో!... అంటూ కేకతో అతని దగ్గరకు వస్తున్న వదినను చూసి ఏమిటీ? వస్తున్నా అని లేచి కూర్చున్నాడు మనోజ్.

త్వరగా రెడీ అవ్వు. లతతో కలిసి కొండనెక్కి వద్దువు" అంది.

ఆనందంతో ఈల వేయబోయి త్వరత్వరగా స్నానంచేసి, కాఫీ కూడా గొంతులో పోసుకోక బయటకు వచ్చాడతను.

అతని కోసమే వెయిట్ చేస్తున్నట్టు ఎదురింటి వసారా ముందు లత!

అంతే మనసు ఓ క్షణం గతి తప్పినా ఎలాగో తమాయించుకుని రండి అంది.

ఆమెతో కలిసి నడుస్తున్నాడన్న మాటేగాని, అతని మనసు ఎక్కడో తేలిపోతోంది.

పోతున్నకొలదీ జన సమూహం బాగానే వుంది అక్కడి విశేషాలు, విశిష్టతను గురించి లత చెబుతున్నా అవేవీ చెవిలో దూరడం లేదతనికి.

ఆమె బుగ్గలపై ముద్దు పెట్టాలనే వాంఛ అధికమైపోతున్నా, ఎలాగో నిగ్రహించుకొని, కొండ ఎక్కుతున్నాడతను.

దర్శనం చేసుకొని వస్తుంటే "ఏమని కోరారు దేవుడిని" అని అడిగితే "త్వరలో నాకో మంచి భర్త రావాలని కోరాను" అని తన రెప్పలను టపటపలాడించి ఓరగా అదే నవ్వు నవ్వింది లత.

మంచి భర్తంటే... ఎవరు?

మళ్ళీ అవే కళ్ళతో సూటిగా అతని కళ్ళలోకి చూస్తూ, ప్రక్కకు చూపు మరల్చుకుంది.

చిన్న, చిన్న బండలను ఎగురుతూ వస్తూంటే లత ఓ బండరాయి దాటుతూ ముందుకు తూలిపడబోతుంటే అమాంతంగా వెళ్ళి ఒడిసి పట్టుకొనే లోపల మరింత చేరువగా అతని హృదయానికి అతుక్కుపోయింది. అలా ఎంత సేపు ఉన్నామో తెలియదు గాని, ఏదో మధురానుభూతిలో గడిపిన ఫీలింగ్... ఇంటికి ఎలా వచ్చి పడ్డారో?

అలా రోజుకి అయిదారుసార్లయినా లత వచ్చేది. వచ్చినప్పుడల్లా వదినతో కన్నా అతనితోనే ఎక్కువగా మాట్లాడేది. నాలుగురోజుల్లో వాళ్ళిద్దరి మధ్యా ఎంతో అనుబంధం పెనవేసుకుపోయింది.

★★★★

"బాబు కొద్దిగా ప్రక్కకి జరుగుతావా" ఎవరో అడగడంతో ఆలోచనల్లోంచి బయటపడి విసుగ్గా అటు చూసాడు మనోజ్.

◆◆◆

**ఆమెతో కలిసి నడుస్తున్నాడన్న మాటేగాని, అతని మనసు ఎక్కడో తేలిపోతోంది.**

◆◆◆

కొద్దిగా ప్రక్కకి జరుగుతూ కూర్చుంటున్నట్లు ఓ పాసింజరు నిలబడున్నాడు. మనోజ్‌కి చిరాకేసింది. అయిష్టంగానే కొద్దిగా ప్రక్కకి జరిగి అతను కూర్చోడానికి చోటిచ్చాడు.

అతని వంక చూస్తే ఎక్కడ కబుర్లు మొదలు పెడతాడోననే భయంతో కళ్ళు మూసుకుని మళ్ళీ గతంలోకి జారిపోయాడు.

★★★★

ఆ రోజు తను మార్నింగ్ షో సినిమాకి వెళ్ళి వచ్చాడు. జోరున వాన కురుస్తోంది. ఇంటికి తాళం వేసివుంది.

అన్నయ్య డ్యూటీకి వెళ్ళుంటాడు. వదిన ఎక్కడికి వెళ్ళిందబ్బా? ఆలోచిస్తూ వాకిట్లో నిలబడ్డాడు తను వర్షంలో తడుస్తూనే.

"ఏమండీ" అన్న కేక వినిపించి లత వాళ్ళింటి వైపు చూసాడు.

వాళ్ళ గుమ్మంలో నిలబడి రమ్మన్నట్లు చేతితోనే సైగ చేసింది లత.

గబగబా అటు వెళ్ళాడతను.

"రండి! తమ్ముడికి బావుండకపోతే అమ్మ, అక్కయ్య కలిసి హాస్పిటల్‌కి వెళ్ళారు. మీరు వస్తే ఇమ్మని తాళం చెవి ఇచ్చారు" తాళం చెవిని అందిస్తూ చెప్పింది లత.

వర్షంలో పూర్తిగా తడిసిపోయాడతను. తన చేతికి ఆమె చెయ్యి తగలగానే నరాలు జివ్వున లాగాయి.

"అరె వణికిపోతున్నారు తుడుచుకోవడానికి టవల్ ఇస్తాను ఆగండి" నవ్విందామె.

నవ్వుతుంటే ఆమె అందం మళ్ళీ విజృంభించింది. తనలో వేడి ఒక్కసారి వెల్లువలా ప్రవహించి వళ్ళంతా వ్యాపించింది. అలాగే లతని పట్టుకుని సుతిమెత్తగా నొక్కాడు... ఆమె పన్నని నడుముపై!

సిగ్గుతో నవ్విందామె. గర్వంతో తన ఛాతి పొంగిపోయింది.

"అమ్మా వాళ్ళు ఇప్పుడే వెళ్ళారు వాళ్ళు

రావడానికి టైము పట్టొచ్చు'' మునిపంట కింద పెదవిని నొక్కుతూ క్రీగంట అతనిని చూస్తూ అంది.

అతనికి పూర్తిగా పరిస్థితి అర్థమైపోయింది. ఆమె అంటే తనెంత ఇష్టపడుతున్నాడో తనంటే ఆమె అంతే ఇష్టపడుతోంది.

ఇప్పుడు తనేం చేసినా ఆమె అభ్యంతరపెట్టదు. చొరవతీసుకోవడమే వాలు! బయట వర్షం. ఎదురుగా ఇష్టపడ్డ ఒంటరి లత.

రెండడుగులు ముందుకు వేసాడు. లత ఒక్క అడుగు కూడా వెనక్కి వెయ్యలేదు.

ఇద్దరి మధ్యా దూరం లేదు.

"అటు చూడండి..." తలుపు వేపు చూపిస్తూ నవ్విందామె.

తలుపు వేసేయమంటోంది గ్రీన్ సిగ్నల్.

చటుక్కున వెనక్కి తిరిగాడు అతను. అక్కడ నించి అన్నయ్య వాళ్ళ ఇల్లు స్పష్టంగానే కనిపిస్తోంది.

ఆ ఇంటిని చూడగానే వదిన గుర్తొచ్చింది. అన్నయ్య కంటి ముందు మెదిలాడు.

ఆ రోజు ఉదయమే తనకి ఉద్యోగం వచ్చినట్లు నాన్నగారిచ్చిన టెలిగ్రామ్ అందింది. ఇవాళో రేపో తను వెళ్ళిపోతాడు. వెళ్ళిపోయిన తర్వాత ఈ విషయం పొరబాటున బయటికి పొక్కితే? అభిమానంగా చూసే అన్నయ్య వదినల మొహం తను చూడగలడా మళ్ళీ? అందరూ వాళ్ళని నానా మాటలు అనరూ.

ఊహూ! తనవల్ల వాళ్ళకా పరిస్థితి రానీయడు చటుక్కున వెనక్కి తిరిగాడతను.

ఎదురుగా లత!

ఆమె కళ్ళలో కోరిక!

ఒక్క క్షణం బలవంతాన తమాయించుకున్నాడు... తన కోరికని.

◆ ◆ ◆

## అలాగే లతని పట్టుకుని సుతిమెత్తగా నొక్కాడు... ఆమె సన్నని నడుముపై.

◆ ◆ ◆

ఆ ఒక్క క్షణం తాము తొందరపడితే మరెన్నో క్షణాలు బాధపడాల్సి వస్తుంది. ఈ పరిస్థితుల్లో కూడా అవకాశం జారవిడిచిన అతని మంచితనాన్ని లత జీవితాంతం గుర్తుంచుకుంటుంది. అంతే! అక్కణ్నించి గబగబా ఇవతలికి వచ్చేసాడు. ఆ రోజు తర్వాత లత కనిపించలేదు. మర్నాడు ఊరెళ్ళేప్పుడు కూడా ఆమె కోసం వెదికాడు అతను. తనకి చెప్పమని వదినకి చెప్పి వచ్చేసాడు.

ఇన్ని రోజులు నుంచీ శారీరకంగా తను లతకు దూరంగా ఉన్నాడు గానీ మానసికంగా ఆమెకెప్పుడూ దూరం కాలేదు. పదిమందిలో ఉన్నా ఒక్కడున్నా ఎప్పుడు ఆమె ధ్యాసే. అందుకే ఉద్యోగం పర్మినెంట్ అయినట్లు ఆర్డరు రాగానే పెళ్ళి ప్రసక్తి తీసుకురావాలని నిశ్చయించుకున్నాడు. పెద్దల ద్వారా ఆ విషయాన్ని కదిలించే ముందు మరోసారి అతను కలిసి ఆమెతో మాట్లాడాలని మరియు రేపు శ్రావణమాసపు మూడో శనివారం కాబట్టి ఇద్దరు రణమండ్లకొండ వెళ్ళాలని బలవంతాన రెండ్రోజులు శెలవు తీసుకొని బయల్దేరాడు.

గట్టి కుదుపుతో రైలాగింది.

ఆదోని!

బ్రీఫ్ కేసందుకొని కిందకు దిగాడు. అన్నయ్య కనిపించలేదు. బహుశా డ్యూటీలో లేనట్లున్నాడు అనుకొని ఇంటివేపు బయల్దేరాడు.

హఠాత్తుగా దిగిన తనని చూస్తూనే అన్నా వదినా ఆశ్చర్యపడ్డా తర్వాత ఆనందపడ్డారు. కుశల ప్రశ్నలయ్యాయి. మనోజ్ కళ్ళు మాత్రం లత అటు వస్తుందేమోనని ఆత్రంగా వెదకసాగాయి. వచ్చి గంట దాటినా ఆమె జాడ లేదు.

ఇక వుండబట్టలేక 'వదినా! లత కనిపించడం లేదే! ఊళ్ళో లేదా!'' అడిగాడు.

"అయ్యో! ఆ పిల్లకి పెళ్ళయిపోయింది. ఇప్పుడు నట్టి మనిషి కూడా కాదు. హో! క్రిందటిసారి నువ్వొచ్చినప్పుడు కూడా చూసావా... నిముష నిముషానికి ఏదో పని మీద వచ్చేది. నాకోసం కాదు నీ కోసం. నిన్ను గురించి చాలా సార్లు అడిగేది'' ఇంకా ఏదో చెప్తోంది వదిన. అవేవీ బుర్రను చేరడం లేదు. ఆశల హరివిల్లు కూలినట్లు అలానే కూర్చుండిపోయాడతను.

తను ఊహించింది ఏమిటే? ఎందుకిలా జరిగింది? చొరవతీసుకోకుండా ఉండడానికి తక్కువ తనం కింద జమ కట్టిందా? అతని బుర్ర గిర్రున తిరిగింది.

"ఆ ఇంక చెప్పడం పూర్తి అయిందా? లేదా!" ముందు కాఫీ పట్టుకురా'' భర్త ఆజ్ఞతో లత గురించి చెప్పడం ఆపి లోపలికి వెళ్ళిందామె మరిది పరిస్థితి గ్రహించలేక.

సాయంత్రపు రైలెక్కి వచ్చేశాడతను.

అతని కల కరిగి 'కన్నీరై' పోయింది. ●



## అమెరికా వెళ్ళిపోయింది

దక్షిణాదిలో ఏమీ సాధించలేకపోయిన నటి 'జమున' తను 'శ్రీదేవి' నయిపోవాలని బొంబాయి చేరింది. అక్కడ కూడా నటిననిపించుకొందంటే. కొన్ని చిత్రాలలో సెక్సీగా డాన్సులు చేసినా ఫలితం దక్కలేదు. స్టేజ్‌షోలు ఇవ్వడం మొదలు పెట్టి అమెరికాలో గొప్పింటి బిడ్డను పట్టిందట. అతను జమున, జమున అంటు ఒకటే జపం చేసేలా మార్చింది. తిరిగి వచ్చి తన మూటాముల్లె సర్దుకుని మళ్ళీ అమెరికా అబ్బాయి దగ్గరకు వెళ్ళిపోయింది.